www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 28 మే 2024



ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలు

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి)
నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిలోని చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లి వద్ద సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా మరోఇద్దరికి తీవ్రగాయాల పాలైయ్యారు. వివరాల్లోకెళితే.. నెల్లూరు జిల్లా నరసారావుపురంకి చెందిన ఓ కుటుంబం సోమవారం వేకువ జామున నెల్లూరు నుంచి కారులో వేలూరు సీఎంసీకి బయలుదేరారు. మార్గమధ్యంలో ఎం.కొంగరవారిపల్లి వద్ద కారు డ్రైవర్ నిద్రమత్తులో డివైడర్ మధ్యలోని కల్వర్టును ఢీకొట్టాడు. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జైంది. ఈప్రమాదంలో డ్రైవర్ షమీర్ బాషా (30), కారులో ప్రయాణిస్తున్న పద్మమ్మ (50), జయంతి (45), శేషయ్య (47) తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీనివాసులు (49), నీరజ (46)లకు తీవ్ర రక్త గాయాలైయ్యాయి. స్థానికుల సమాచారంతో అక్కడి చేరుకున్న పోలీసులు కారులోంచి ప్రాణాపాయ స్థితిలో ఉన్న శ్రీనివాసులు, నీరజలను హుటాహుటిన తిరుపతి రుయాసుపత్రికి తరలించారు. కారులో చిక్కుకొని ఉన్న నలుగురి మృతదేహాలను పోలీసులు అతి కష్టం మీద వెలికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామయ్య తెలిపారు. మృతులు వేలూరు సీఎంసీలో వైద్యపరీక్షల కోసం వెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. సంఘటన పలువురిని కలిచివేసింది.

అడిగోపుల ఆదిశేషయ్య

అడిగోపుల జయంతి

డ్రైవర్ సమీర్

పద్మావతమ్మ

కారు నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న పోలీసులు

వినోదం.. విజ్ఞానం..

ప్రజాశక్తి- తిరుపతి సిటీ
ఒకప్పుడు వేసవి సెలవులు అంటే పిల్లలకు ఆనందంతో పాటు ఆటపాటలతో ఆహ్లాదాన్ని, ఆలోచనశక్తిని, దేహదారుఢ్యాన్ని అందించేంది. కానీ ఇప్పుడు సెలవులు అంటే కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్‌లతో కాలం గడపుతూ విద్యార్థులు మేథోశక్తిని కోల్పోతున్నారు. శారీరక శ్రమ లేకపోవడంతో అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు. పోటీ ప్రపంచాన్ని అందుకునేందుకు అటు కార్పొరేట్ విద్యాసంస్థలతో సహా, ఇటు తల్లిదండ్రులు సైతం పిల్లలను ర్యాంకుల వేటలో పడేసి, చదువే జీవితం అంటూ విపరీతమైన ఒత్తిడిని పెంచుతున్నారు. దీనిద్వారా విలువలను, మానవీయతను కోల్పోతూ భావిభారత పౌరులైన పిల్లలు బట్టి చదువులకు అలవాటు పడుతున్నారు. దీంతో విజ్ఞానానికి కూడా దూరమవుతుండడం శోచనీయం. పిల్లలను మనుషులుగా చూడకపోగా మార్కుల యంత్రాలుగా తయారు చేస్తుండడం బాధాకరం. ఇలాంటి తరుణంలో వేసవి సెలవుల్లో సైతం ఏదో ఒక కోర్సుకు శిక్షణ పేరుతో సెలవులను సైతం బట్టిచదువుల కొనసాగింపుగా, పిల్లలను విద్యాయంత్రాలుగా మార్చేస్తున్న వైనం.

ఈ నేపథ్యంలో వేమన విజ్ఞాన కేంద్రం విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు నడుం బిగించింది. చదువుతో పాటు సంస్కారం నేర్పిద్దాం.. అవకావం ఉన్న అన్ని కళలలో ప్రవేశాన్ని కల్పిద్దాం.. ఈ వేసవి సెలవులను ఇందుకు ఉపయోగించు కుందాం అని చెబుతూ, వేసవి సెలవుల్లో కొద్దిసేపు ఆట- పాట - మాట నేర్చుకుందాం రండి అంటూ పిలుపునిచ్చి, పిల్లలకు వినోదాన్ని పంచుతూనే విజ్ఞానాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. తిరుపతి యశోధనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో పిల్లలకు 20మంది వివిధ రంగాల్లోని నిపుణుల చేత చెస్, పాటలు, డ్యాన్సులు, డ్రాయింగ్, పెయింటింగ్, స్పోకన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్, తెలుగు తప్పులు లేకుండా రాయడం, దేశభక్తి గీతాలు, చేతివ్రాత మెలుకువలు, కథలు చెప్పడం, మ్యాజిక్, మ్యూజిక్, ఫన్ విత్ మ్యాథ్స్ బయోడైవర్సిటీ, కర్రసాము వంటి అనేక అంశాలపై నిపుణుల చేత శిక్షణ అందిస్తోంది. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో వేసవి ఉక్కపోతను దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ ఏసి గదుల్లో శిక్షణను ఇస్తోంది. ఏప్రిల్ 28వ తేది నుంచి జూన్ రెండో తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు రంగాల్లో తర్ఫీదు ఇస్తోంది. దీనికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. పైగా శిక్షణ ప్రారంభించిన తక్కువ కాలంలోనే పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకునే మార్పు స్పష్టంగా కన్పించడంతో పాటు విలువలు పెంపొందించుకోవడంతో తల్లిదండ్రుల ముఖాల్లో సైతం సంతోషం వెలువిరుస్తుంది. వేసవిల్లో కూడా విద్యార్థులు శిక్షణ తీసుకునేందుకు ఎంతో ఆశక్తి చూపుతూ, ఆఫ్ డే కాదు, ఫుల్‌డే శిక్షణివ్వండి అంటూ నిర్వహకులను కోరుతుండడం గమనార్హం. వేసవి సెలవుల్లో తమలో దాగిని సృజనాత్మకతకు పదునుపెట్టి, తమ సామర్థ్యాన్ని చాటుకున్న విద్యార్థులు, వారికి మంచి వా తావరణంలో శిక్షణ ఇచ్చిన నిపుణులు అభిప్రాయాలు వారి మాటల్లోనే.....

సైన్స్‌పై అవగాహన పెంచేలా కృషి..
- యుగంధర్ బాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జన విజ్ఞానవేదిక.

విద్యార్థుల్లో సైన్సుపై అవగాహన పెంచేలా కృషి చేస్తున్నాం. మ్యాజిక్ ద్వారా సైన్స్‌లోని శాస్త్రీయతను తెలియజేస్తున్నాం. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు తరుచూ శిక్షణ ఇచ్చేవాడిని, ఇప్పుడు అర్బన్ కేంద్రంలో కూడా శిక్షణ ఇస్తున్నా. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లల కంటే అర్బన్ ప్రాంతంలోని విద్యార్థుల్లో కాస్త అవగహన మెండుగా ఉంది. కంప్యూటర్, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, టీవీల ద్వారా సైన్సు పట్ల కాస్త అవగాహన ఉండడంతో తాను బోధించే దాన్ని త్వరగా అవగాహన చేసుకుంటున్నారు. సైన్సులోని అంశాలపై శిక్షణతో పాటు ప్రయోగాలు చేపిస్తుండడంతో వాటిపై పిల్లలకు బాగా అవగాహన అవుతోంది. ప్రస్తుతం విద్యావ్యవస్థలో సైన్స్ ప్రయోగాలకు మరుగునపడుతున్నాయి. విద్యార్థులు ర్యాంకుల మోజులో పడేస్తున్నారు. ఇది సరైనది కాదు. పిల్లల్లోని సృజనాత్మకతకు పదును పెట్టాలి. సైన్సును సైన్స్‌గానే అర్థం చేసుకోవాలి.

విద్యార్థులను యంత్రాల్లాకాకుండా విజ్ఞానవంతులుగా మలచాలని
- నడ్డి నారాయణ, అధ్యక్షులు, వేమన విజ్ఞాన కేంద్రం.

వేసవి సెలవుల్లో పిల్లలు స్కూల్స్ కూడా లేకపోవడంతో ఎక్కువుగా సెల్‌ఫోన్లకు బానిసవుతున్నారు. దీంతో ఎక్కువుగా గదులకే పరిమితం అవుతూ పాజిటివ్ కంటే నెగిటివ్ అంశాల వైపే ఎక్కువుగా దృష్టి మళ్లిస్తున్నారు. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతూ జ్ఞానసంపదను వృద్ధి చేసేందుకు వేసవి సెలవుల్లో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. గణితం పట్ల ఎక్కువ మంది పిల్లలకు భయం. ఆ భయాన్ని పోగొట్టేందుకు అందులో మెలుకవళలు తెలియజేస్తున్నాం. చెస్, స్పోకన్ ఇంగ్లీష్, కర్రసాము వంటి వాటితో పాటు ఆనందాన్ని పంచే పాటలు, ఆటలు, మ్యాజిక్‌లలో శిక్షణ ఇవ్వడం ద్వారా పిల్లలకు విజ్ఞానాన్ని అందిస్తున్నాం, ప్రస్తుతం తమ వద్ద 250 మంది విద్యార్థుల వరకు శిక్షణ పొందుతున్నారు.

పిల్లల్లో స్పందన పెరుగుతోంది..
-నెల్లూరు మునిలక్ష్మీ, శ్రీదివ్యాంగ్ సేవా కేంద్రం, వ్యవస్థాపకులు.

ప్రస్తుతం ఇస్తున్న శిక్షణను ఒత్తిడితో కాకుండా వినోదాన్ని పంచుతూ విజ్ఞానాన్ని అందించడం వల్ల పిల్లల్లో మరింత ఆశక్తిపెరిగి, సంపదన వస్తోంది. పిల్లల రోజువారి వ్యవహారాల్లో చిన్నచిన్న మార్పులు చేసుకునేలా చేస్తున్నాం. సెలవుల్లో 8గంటలపైన నిద్రలేచేవారు. ఇప్పుడు 5 నుంచి 6 గంటలకే నిద్రలేస్తున్నారు. నిద్రలేచిన తర్వాత వారి పనులు వారే చేసుకుంటూ తల్లిదండ్రుల పనుల్లో సైతం సాయం చేస్తున్నారు. ప్రేమ, ఆప్యాయతలను పెంపొందించుకుని, పెద్దల పట్ల, ఇంటికి వచ్చే అతిథుల పట్ల వ్యవహరించే తీరులో మార్పు తెచ్చుకుంటున్నారు. ఈ విషయాలను వారి తల్లిదండ్రులే నేరుగా వచ్చి చెప్పుతూ తమ శిక్షణ పట్ల ఆనందాన్ని వ్యక్తం చేయడం సంతోషంగా ఉంది.

మంచి డ్యాన్సర్‌గా ఎదుగుతా

వేసవి శిక్షణలో డ్యాన్సుపై మంచి శిక్షణ ఇస్తున్నారు. చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే ఇష్టం. చిన్నచిన్న పాటలకు డ్యాన్సు వేసేదాన్ని, ఇక్కడికి వచ్చిన తర్వాత పోక్, క్లాసికల్ డ్యాన్సులు బాగా ప్రదర్శిస్తున్నాను.
- బి.లాష్య, 8వ తరగతి. తిరుపతి.

మంచి హ్యాండ్‌రైటింగ్ నేర్చుకున్నాను..
వేసవి తరగతుల్లో నా చేతిరాతిను మార్చుకుని మంచి హ్యాండ్ రైటింగ్‌ను పెంపొందించుకున్నాను. ఇక్కడ సార్లు ఇచ్చే ట్రైనింగ్ చాలా బాగుంది. ఇది నాకు ఎంతో ఉపయోగపడుతోంది.
- బి.ఉషశ్రీ, 8వ తరగతి, తిరుపతి.

చిత్రలేఖనంలో ప్రావీణ్యం

బొమ్మలు వేయాలంటే చాలా ఇష్టం. సమ్మర్ క్యాంప్‌లో మా మేడమ్‌లు ఇచ్చిన మెలకువళతో పెద్ద పెద్ద బొమ్మలను కూడా, అతి తక్కువ సమయంలోనే చాలా అందంగా వేసే ప్రావీణ్యం స్పంపాదించడం సంతోషంగా ఉంది.
-ఎం.వైష్ణవి, 8వ తరగతి, తిరుపతి.

చెస్‌లో రాణిస్తాను

సమ్మర్ క్యాంప్‌లో చెస్‌గేమ్‌లో ఎలా ఎత్తులకు పై ఎత్తులు వేయాల్లో బాగా అర్థమయ్యేలా శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు చెస్ బాగా అడుతున్నాను. తప్పకుండా ఇందులో రాణిస్తాను.
-పి.వర్ష, 6వ తరగతి, తిరుపతి.

మ్యాజిక్ చేస్తాను

చిన్నప్పటి నుంచి సర్కాస్, ఎగ్జిబిషన్, మ్యాజిక్ షోలకు వెళ్లేదాన్ని. వాటిని చూసేదాన్నే తప్పా, చేసేదాన్ని కాదు. ఇక్కడకి వచ్చిన తర్వాత మ్యాజిక్‌లో శిక్షణ ఇచ్చారు. సైన్స్ పట్ల అవగాహన పెంచారు. ఇప్పుడు చిన్న చిన్న మ్యాజిక్‌లు చేస్తున్నాను.
- జి.మధులత, 6వ తరగతి, తిరుపతి.

ఇంగ్లీష్ బాగా మాట్లాడుతున్నాను

సమ్మర్ క్యాంప్‌లో స్పోకన్ ఇంగ్లీష్‌లో ట్రైనింగ్ తీసుకున్న తర్వాత ఇంగ్లీష్ బాగా మాట్లాడుతున్నాను. ఇంట్లో అమ్మనాన్నలు కూడా నాలో వచ్చిన మార్పు చూసి సంతోషిస్తున్నారు. ఈ ట్రైనింగ్ నాకు బాగా నచ్చింది.
- జి.నాగభార్గవి, 7వ తరగతి, తిరుపతి.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

ఆర్‌సి పురం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ హర్షవర్ధన్

ప్రజాశక్తి- రామచంద్రపురం: మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దష్టి సారించాలని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆర్‌సి.పురం పోలీసులను ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా రామచంద్రపురం మండల పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. మండల పరిధిలోని గ్రామాలలో కార్డెన్ సెర్చ్, పోలీస్ కవాతు, నాకాబందీలు నిర్వహించి, హింసాత్మక ఘటనలకు పాల్పడే వ్యక్తులనుపై చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లకు, ట్రబుల్ మాంగర్కు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. దాడులకు ప్రేరేపించే వ్యక్తులను గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఎస్ఐకి ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్లో ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారనే వివరాలను తెలుసుకొని ఎందుకు తక్కువ సిబ్బంది ఉన్నారని ఎస్ఐలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందిని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ గురుశేఖర్, చంద్రగిరి డీఎస్పీ శరత్ రాజుకుమార్, ఎస్సై చిరంజీవి, హెడ్ కానిస్టేబుల్స్ సురేష్, రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మదన్మోహన్, త్యాగరాజులు, అబ్రహం, దివ్య పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఎన్నికల సిబ్బందికి రెమ్యునరేషన్ ఏదీ..?

డ్యూటీ సర్టిఫికెట్ల జారీలోను జాప్యం!

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి
తిరుపతి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసినా గానీ ఎన్నికల విధులు నిర్వర్తించిన సిబ్బందికి రెమ్యునరేషన్ ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. పోలింగ్ పూర్తయిన మరుదినమే సిబ్బందికి రెమ్యునరేషన్ ఇవ్వాల్సి ఉంది. అయితే జిల్లా అధికారులు ఏ కారణంగానో ఇంతవరకు ఇవ్వలేదు. తిరుపతి జిల్లా పరిధిలో సెక్టోరియల్ ఆఫీసర్లుగా 328మంది, ఫ్లయింగ్ స్క్వాడ్‌లో 83 మంది, ఎస్ఎస్ టీగా 62 మంది, ఎంసీసీగా 45మంది, వీఎస్టీలుగా 32మంది, వీవీటీలుగా 32 మంది 58 రోజులు పాటు విధులు నిర్వర్తించారు. ఇందులో టీమ్ లీడర్లుకు రోజుకు రూ.450లు, సభ్యులకు రూ.300ల వంతున రెమ్యునరేషన్ చెల్లించాల్సి ఉంది. పోలింగ్ ప్రక్రియ పూర్తయి 15రోజులు దాటిపోయినా జిల్లా అధికారులు వీరికి ఇంకా రెమ్యునరేషన్ ఇవ్వలేదు. పోలింగ్ రోజున ఎన్నికల విధులు నిర్వర్తించిన పీవో, ఏపీవో, ఓపీవోలకు ఆ రోజే రెమ్యునరేషన్ ఇచ్చేశారు. 58 రోజుల పాటు విధులు నిర్వర్తించిన వారికి మాత్రం ఇంతవరకు రెమ్యునరేషన్ ఇవ్వలేదు. వీరు నిత్యం రిటర్నింగ్ అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ వారు స్పందించడం లేదు. దీంతో తమ రెమ్యునరేషన్ వస్తుందో, రాదోనని ఎన్నికల విదులు నిర్వర్తించిన ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల విధులు, ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి హాజరైన సిబ్బందికి ఎన్నికలు పూర్తి అయ్యి రెండు వారాలు గడుస్తున్నా డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయలేదని యూటీఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. సోమవారం యుటిఎఫ్ నాయకులు శ్రీకాళహస్తి ఆర్‌డిఓ రవిశంకర్ రెడ్డిని కలిసి డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని వినతిపత్రం అందజేయడం గమనార్హం.

అపరిచితుడువి అన్నీ అబద్ధాలే..

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):

శ్రీ పద్మావతి మహిళ విద్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి, చంద్రగిరి ఎమ్మెల్యే, తుమ్మలగుంట పరిచితుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చెప్పేవన్నీ అబద్ధాలే అని చంద్రగిరి టిడిపి అభ్యర్థి పులివర్తి నాని విమర్శించారు. తిరుపతి రూరల్ రఘునాథ రిస్టార్ట్‌లోని పులివర్తనాని నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పద్మావతి మహిళా యూనివర్సిటీలో తనపై దాడి జరగలేదని చెవిరెడ్డి చెప్పడం శుద్ధ అబద్ధం అన్నారు. వైసీపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి ఉద్దేశం పూర్వకమైన తనపై దాడి చేశాడని, మొదట కారులో నుంచి దిగి రెండోకారులు దాక్కున్న తనను వదలేదని, సుత్తితో తనపై దాడి చేయడంతో తన గన్మెన్ అడ్డుకోవడంతో తీవ్ర గాయాలు అయ్యాయని గుర్తు చేశారు. మహిళ యూనివర్సిటీ నుంచి తనకు ఎలాంటి డబ్బులు తగలకుండా రెండు గంటల తర్వాత ఇంటికెళ్లి ఫ్రెష్ అయ్యి తిరిగి హాస్పిటల్‌లో జాయిన్ అయ్యానని, చెవిరెడ్డి చెప్పడం దారుణమన్నారు. సిట్ బృందం విచారణకు పిలవడంతో వెళ్లిన పొట్టేలును చూపించి, దాడి రోజు తాను డ్రెస్ మార్చాను అని చెప్పడం అవివేకం అన్నారు. నామినేషన్ రోజు సైతం తాను అడిగిన టైంకి నామినేషన్ వేసేందుకు వెళ్లానని అక్కడ కూడా వైసిపి నాయకులు ఉద్దేశపూర్వంగా మా పార్టీ జెండాను అవమానించి మాపై దాడికి దిగారు అన్నారు. చంద్రగిరి లోనే నాగాలమ్మ గుడిని దర్శించుకునేందుకు ఉదయం 9 గంటలకు అనుమతి అడిగితే పోలీసులు ఇవ్వలేదని, కనీసం 9:30 కన్నా ఇవ్వమని చెప్పినా కాలయాపన చేశారని, దీని వివాదాస్పదం చేయుడి ఎందుకని ఉదయం 5 గంటలకే తాను ఆలయ దర్శనానికి వెళ్లానని చెప్పారు. కానీ తాను ప్రశాంతంగా పూజలు చేసుకుని కున్న ఆలయం ముందురా డీజే పెట్టి ఇబ్బందులకు గురి చేశారని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేయకుండా అడ్డుకున్నారని, తన నామినేషన్ ర్యాలీని ప్రశాంతంగా జరగనీయకుండా అడుగడుగున అవరోధాలు సష్టించారని గుర్తు చేశారు. అన్ని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనలు మేరకు వైసిపి నాయకులు చేసి తమపై తమ పార్టీపై నెపం వేయడం విడ్డూరంగా ఉందన్నారు. తనపై జరిగిన దాడులకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌ను మీడియా ముందు వివరించారు.

'ఓట్ల లెక్కింపు' విజయవంతం చేయాలి

భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

జూన్ 4వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేసుకోవాలని నిర్వాచన సదన్, న్యూఢిల్లీ నుంచి భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో ఏమాత్రం జాప్యం చేయకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలను ప్రకటించాలన్నారు. ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సీఈవోలు, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లాల ఎన్నికల అధికారులతో ఎలక్షన్ కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్బీర్ సింగ్ సందుతో కలసి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించగా తిరుపతి జిల్లా కల్లెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్, డిఆర్ఓ పెంచల్ కిషోర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫెరెన్స్‌లో భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మాట్లాడుతూ దశలవారీగా దేశవ్యాప్తంగా జరుగుచున్న సార్వత్రిక ఎన్నికలను అందరి సమిష్టి కృషితో ఎంతో విజయవంతంగా జరుగుచున్నదని, అదే స్ఫూర్తితో వచ్చే నెల 4వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద క్రౌడ్ మేనేజ్మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత పాస్ లేకుండా ఎవరినీ అనుమతించవద్దన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పవర్ బ్యాక్‌అఫ్, ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ఆరోగ్యసేవలు సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ వంటి ఐటి పరికాలను ముందస్తుగా ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రకటించే విషయంలో ఏమాత్రం ఆలస్యం చేయవద్దని, డిస్ప్లే బోర్డుల ద్వారా పుటికప్పుడు ఖచ్చితమైన ఎన్నికల ఫలితాలను ప్రకటించాలన్నారు.

కోవర్ట్‌ల ప్రభావం ఎంత?

- గోడమీద పిల్లిలా వ్యవహరించిన నేతల గురించి ఆరా..
- ప్రధాన పార్టీ నేతల్లో అంతర్మథనం

ప్రజాశక్తి- డక్కిలి:

ఎన్నికలన్నాక రకరకాల పాలిటిక్స్ చూస్తుంటాం.. అందులో కోవర్ట్‌ల ఆపరేషన్ ఒకటి. ఒక పార్టీలో ఉంటూనే మరో పార్టీ నేతలతో టచ్‌లోకి వెళ్లి ఇక్కడ విషయాలు అక్కడ చేరవేస్తూ రాజకీయాలు నెరపడం.. అంటే ఇక్కడుండగానే అటు కూడా ఒక కర్చీఫ్ వేసి పెట్టడం, తెలుగుదేశంలో కొందరు నాయకులు వైసిపితో టచ్‌లో ఉన్నారు. వైసిపిలో ఉన్న నాయకులు కొందరు టిడిపితో టచ్‌లో ఉన్నారు. ఇలాంటి నీచమైన రాజకీయాలు ఎన్నికల్లో నడుస్తుంటాయి. వెంకటగిరిలో ముఖ్యంగా ఇలాంటి రాజకీయాలకు పెట్టింది పేరంటారు. పది మందికి మంచి చెయ్యడం కంటే కూడా వారి వ్యక్తిగత స్వార్థం కోసం రాజకీయాలు ఉపయోగించుకోవడం ఎప్పటి నుంచో ఉన్నా ఇక్కడ మాత్రం ఆ టైపు రాజకీయాలకు పరాకాష్ట, ఒక నీతి, రీతి ఏదీ లేదు. రవ్వంత కూడా సిగ్గులేకుండా అన్నా మన పార్టీ గెలిచాక నేను అటొస్తాను.. ఆ సీటు నాది.. ఇదిగో ఇదిగో కర్చీఫ్.. నేను ఇక్కడి నుంచే నీకు అది చేస్తా.. ఇది చేస్తానంటూ మంతనాలు చేసిన నాయకులు ఉన్నారు.. ఈ కార్యాచరణలో భాగంగా ఇరు పార్టీలలోని అలాంటి రాజకీయ కట్టప్పలు పోలింగ్ రోజున ఏజెంట్లుగా కూర్చుంటామని పేర్లు రాయించుకుని పోలింగ్ బూత్ ఖర్చులు సైతం జోబులో వేసుకుని అవతల పార్టీ క్యాడర్ యథేచ్ఛగా దొంగఓట్లు వేసేందుకు ప్రయత్నిస్తున్న తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇంకా ఓటర్లకు నగదు పంపిణీ చేసే సమయంలో టిడిపికి సంబంధించిన నగదు వైసిపి ఓటర్లకు పంపిణీ చేయించడం, వైసీపీ నాయకులు టిడిపి గ్రామస్థాయి నాయకులు, ఓటర్లకు నగదు పంపిణీ చేయించి ఇరు పార్టీలలోని కోవర్టులు సేఫ్ గేమ్ ఆడా మని సంబరపడ్డారు. అయితే ఇలాంటి వ్యవహారాల పట్ల ఇరు పార్టీల కీలక నేతలు దష్టి సారించి రహస్యంగా వివరాలు సేకరించారని సమాచారం వినిపిస్తుంది. ఇలాంటి కట్టప్పల రాజకీయాలకు పాల్పడేవాళ్ళ పట్ల అభ్యర్థులు కూడా జాగ్రత్తగానే వుంటారు. ఎన్నికల సమయంలో వారిని చిన్నమాట అనాలన్నా.. వారి నుంచి ఎంత నష్టం జరుగుతుందో అని మిన్న కుండిపోయారు. ఎన్నికలు ముగిసిన తర్వాత అలాంటి వారిపై దృష్టి సారించి ఏయే గ్రామాల్లో అలాంటి వారి వల్ల జరిగిన నష్టమెంతో, వారి ప్రభావం ఎంతో లెక్క తేల్చే పనిలో ఇరుపార్టీల నేతలు దష్టి సారించారు. భ్రష్టుపట్టించే ఇలాంటి నాయకులు భవిష్యత్తులో డబుల్ గేమ్స్ ఆడకుండా జాగ్రత్తలు తీసుకుంటే రాజకీయాలకు మంచిదని పార్టీని నమ్ముకుని నిజాయితీగా రాజకీయాలు చేసే నాయకులతోపాటు, రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

భలే అవకాశవాదం..

కోవర్ట్‌లకు మరో అవకాశం కూడా ఉంది. ప్రత్యర్థి పార్టీ ప్రయోజనాల కోసం పనిచేసినా.. సొంత పార్టీ గెలిస్తే గుట్టుచప్పుడు కాకుండా ఈ విజయం క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుని ఎంచక్కా ఆ నేత నీడలోనే ఉండొచ్చు. ఇలా కాకుండా ఎవరికోసమైతే కోవర్టు అవతారమెత్తారో వారే గెలిస్తే దర్జాగా మళ్లీ వారి దగ్గరకు వెళ్లిపోయి అక్కడా గెలుపు క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకునే సౌలభ్యం కోవర్టులకు మాత్రమే ఉంది.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతిడెస్క్: మండలంలో రైతులకు సబ్సిడీ దరకు 750 క్వింటాల వేరుశనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి ఖాదర్ బాషా తెలిపారు. ప్రతి పంచాయతీలో గల స్థానిక రైతు భరోసా కేంద్రం నందు వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని గ్రామ వ్యవసాయ సహాయక అధికారుల నుంచి 29వ తేదీ బుధవారం నుంచి వేరుశెనగ విత్తనాలు పొందవచ్చు అని ఏవో తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు 1బి తప్పనిసరిగా తీసుకొని బయోమెట్రిక్ ద్వారా విత్తనాలు పొందాలని పేర్కొన్నారు. కే సిక్స్ 30కిలోల విత్తనాలు సబ్సిడీ ధర రూ.1730, కదిరి లేపాక్షి రకం సబ్సిడీ ధర రూ.1560, ఉంటుందని కావలసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జరిమానా

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 16మంది ముద్దాయిలను నాల్గవ అడిషనల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం 16 మందికి రూ.1,60,000 జరిమానా విధించారు. ఇందులో అధిక మోతాదులో మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి జరిమానాతో పాటు 2 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని తిరుపతి ట్రాఫిక్ డిఎస్పి రమణ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అభినందించి, భవిష్యత్తులో యాత్రికుల, తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా మరింత నూతన ఉత్సాహంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

కోరిన వారందరికీ ఉపాధి పనులు: పీడీ శ్రీనివాస్ ప్రసాద్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమనాడు పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఎం.ఐ ట్యాంక్ పనిని ఉపాధి హామీ పీడీ శ్రీనివాసప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సక్రమంగా పని కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే తొండమనాడు పంచాయతీ క్షేత్ర సహాయకులు బుధవారం నుంచి 150 మంది కూలీలతో పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గజరాజుల గణన

సతీష్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ ప్రాంతంలో ఏనుగు జాడలను గుర్తిస్తూ వాటి గణన కొనసాగుతోంది. మూడు రోజులపాటు సాగే గజరాజుల గణన కార్యక్రమంలో భాగంగా శేషాచలం అటవీ పరిధి టీఎన్ పాలెం సెంట్రల్ బీట్ లోగల నీటి కుంటల ప్రదేశాలలో ఏనుగుల గుంపును గుర్తించినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్‌రెడ్డి తెలిపారు. రెండు చోట్ల ఏనుగుల గుంపు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ గుంపులో 13ఏనుగులు ఉన్నట్లు అంచనా వేయడం జరిగిందన్నారు. శేషాచల అటవీ పరిధిలోని 20ఫారెస్టు బీట్లలో ఈ గజరాజుల గణన చేయడానికి దాదాపు 100మంది అటవీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. మూడు అంశాలుగా ఏనుగుల గణన అనేది జరుగుతుందన్నారు. ప్రస్తుతం గణన కార్యక్రమం పూర్తి కాలేదని, పూర్తి అయిన తర్వాత పూర్తి సమాచారంతో చిత్తూరు డిఎఫ్ఓకు ఏనుగుల గణన లెక్కింపు జాబితాను పంపిస్తామని జిల్లా అటవీశాఖ అధికారి సతీష్ రెడ్డి తెలిపారు.

ప్రశాంతతకు సహకరించండి: వైసీపీ

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం ఉండేలా పులివర్తి నాని సహరించాలని వైసిపి నాయకులు చంద్రమౌళేశ్వర రెడ్డి, చిన్నియాదవ్, కేశవులు విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. రాజకీయాలు కొంతకాలమేనని, ఎవరి తప్పులు వాళ్ళు తెలుసుకొని మళ్లీ స్వతహాగా వారి జీవన శైలిలో నిమగ్నం అవ్వాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎప్పుడూ కార్యకర్తలకు చెబుతుంటారన్నారు. గొడవలు మొదలుపెట్టి దాన్ని హింసాత్మకంగా మార్చింది టిడిపి వారేనన్నారు. సంబంధం లేని వ్యక్తులను శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వద్ద జరిగిన దాడిలో ముద్దాయిలుగా పేర్కొనడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలాగా కాపాడే గుణం కలిగిన వ్యక్తి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అని, అలాంటి వ్యక్తిని ఏక వచనంతో సంబోధించడం రాజకీయాల్లో పద్ధతి కాదన్నారు. ఎక్కడ గాని ఈ కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ బలోపేతం కోసం కృషిచేసి ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రణాళికలు చేస్తూ పాలన కొనసాగించారన్నారు. కానీ ఘటనకు కారణంగా చెవిరెడ్డిని, మోహిత్ రెడ్డిని, రఘునాథరెడ్డినీ కారణంగా చూపుతూ మీడియాలో వారి పేర్లను మాట్లాడడం బాధాకరమన్నారు. ఇకనైనా చంద్రగిరి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం ఉండేలా కార్యక్రమాలను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

సిలిండర్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని పారిశ్రామిక వాడలో సోమవారం సిలిండర్ ఫ్యాక్టరీలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జిడిఆర్ ఫ్యాక్టరీలో కాళీ సిలిండర్లు తయారు చేసే పరిశ్రమలో సిలిండర్ పైన వేసే రెడ్యాక్సైడ్ పెయింట్ ఎన్సీ టిన్నర్ ఫ్యాక్టరీ ఆవరణలో నిలువ ఉంచడంలో ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు వెంటనే సిలిండర్ ఫ్యాక్టరీ సిబ్బంది అగ్నిమాపక శాఖ వారికి ఫోన్ చేయడంతో వారు వెంటనే సకాలంలో స్పందించి మంటలను ఆర్పేశారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి: డాక్టర్ రెడ్డప్ప

ప్రజాశక్తి-వెంకటగిరి రూరల్: వెంకటగిరి మండలంలోని మొగళ్ళగుంట గ్రామంలో ప్రతి నెల 4వ సోమవారం జరుగు 104సేవలో భాగంగా సోమవారం డాక్టర్ రెడ్డప్ప ప్రజలకు వైద్య సేవలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలు, వయోవృద్ధులు, ఈ వేసవి కాలంలో జాగ్రత్తగా ఉండాలని, ఉష్ణోగ్రత అధికంగా ఉండటం వలన రోజుకి 8లీటర్లు నీళ్ల తాగాలని, ఎండలో తిరగకుండా చెట్లు కింద, ఇళ్లల్లో ఉండాలని సూచించారు. ప్రతినెల క్రమం తప్పకుండా బీపీ షుగర్ ఉన్న వారు పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని తెలిపారు. ప్రభుత్వం వారు ఆధ్వర్యంలో డాక్టర్లు, నర్సులు వెల్నెస్ సెంటర్లో మీకు అందుబాటులో ఉంటారని ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అమ్మ చేస్తారని, ఆరోగ్యపరమైన సలహాలు సూచనలు ఈ సెంటర్లో తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లలో పాల్గొన్నారు.

షర్మిల ప్రణాళికలతో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు: సునీల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి తన స్వీయ ప్రణాళికలతో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు సునీల ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడానికి కాంగ్రెస్ శ్రేణులంతా కృత నిశ్చయంతో దేశవ్యాప్తంగా పనిచేస్తుంటే రాష్ట్రంలో అభ్యర్థుల ఎంపికలో వైయస్ షర్మిల రెడ్డి అనుసరించిన వైఖరి, ప్రజాదరణ కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయడంలో వెనకబడ్డారన్నారు. కాంగ్రెస్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తన సొంత ఆలోచనలను అమలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ పతనానికి ఆమె పాల్పడుతున్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి జగపతి, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ బాబులను చూసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుగా తామేమి నేర్చుకోవాల్సిన పనేమి లేదన్నారు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసిన సీనియర్ నాయకులను ఎలా గౌరవించాలో కూడా తెలియని వారితో తాము శిక్షణలు తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుసరించే విధానాలను పాటించని వారిని ఎంపీ అభ్యర్థిగా చిత్తూరులో ఎలా నిలబెట్టారని ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డిని ప్రశ్నించారు. పార్టీ పతనాన్ని కోరే వారిపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి: ఎంఈవో

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో

ప్రజాశక్తి-రామచంద్రపురం: విద్యార్థుల శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి మధ్యాహ్న భోజనంలో పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు అన్నారు. సోమవారం కమ్మ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే వంట వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాగి జావా, ఉడికించిన గుడ్డు తీసుకోవడం ద్వారా ఎముకల బలాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. సమతుల్య ఆహారం అందించడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని తెలిపారు. రోజువారి మెనూ తప్పక పాటించాలన్నారు. తద్వారా విద్యార్థులకు అవసరమైన విటమిన్లు, కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, సమతుల్య కలయికతో అందుతాయన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ రాజు మధ్యాహ్న భోజనం తయారు చేయడంలో వంటవారికి మెలుకువలను నేర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయం సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటోలు ఢీ

- ఐదు మందికి గాయాలు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణ శివారు పరిధిలోని టిడ్కో ఇండ్ల సమీపంలో ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొని ఐదు మందికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు గూడూరు మండల పరిధిలోని కాండ్రా గ్రామం నుంచి గూడూరుకి వస్తున్న ఆటో అదే మార్గంలో గూడూరు నుండి కాండ్రాకి వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. కాండ్రా గ్రామానికి చెందిన శ్రీను, రమణయ్య, ఆఫీజ్ ఇమ్రాన్, గాయపడ్డారు. క్షతగాత్రుల 108 వాహనం ద్వారా గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఒకరిని మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకి తరలించారు. అనంతరం గూడూరు రూరల్ పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమాన్నరు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని నెమిలిమిట్ట అగ్రహారం గ్రామ సమీపాన ఉన్న జాతీయ రహదారిపై వెదురుపట్టు క్రాస్ రోడ్డులో సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో వేలూరు శ్రీహరి(26) మృతి చెందారు. వివరాలు.. శ్రీహరి స్వగ్రామం సూళ్లూరుపేటలోని బాబుజి కాలనీకి చెందిన వారు ఇతను వెదురు పట్టు క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు క్రాస్ చేస్తూ ఉండగా అదే సమయంలో నెల్లూరు వైపు నుంచి చెన్నై వైపు వెళుతున్న మోటర్ బైక్ ఢీకొన్నది దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు అంబులెన్స్‌లో క్షతగాత్రుని సూళ్లూరుపేట హాస్పిటల్‌కు తరలించగా శ్రీహరి చనిపోయినట్లుగా తెలిపారు. ఈ కేసును ఎస్ఐ తిరుమల రావు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని కారు దగ్ధం

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చంద్రగిరి): పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారి సి.మల్లవరం సమీపంలో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి నుంచి బెంగుళూరు వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. సి.మల్లవరం సమీపంలో కారు అతివేగంగా వస్తూ అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొని మరో రోడ్డు వైపు దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వెంకటసాయి కళ్యాణ్, చరణ్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది.

రోడ్డు ప్రమాదానికి గురై దగ్ధమైన కారు

వైభవంగా కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు

కళ్యాణ వెంకన్నకు స్వప్న త్రిమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక వసంతోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారిని వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు శ్రీ భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. మే 28న స్వర్ణరథోత్సవం. మంగళవారం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు స్వర్ణ రథోత్సవం కన్నుల పండుగగా జరుగనుంది. వసంతోత్సవాల కారణంగా ఆలయంలో ఆర్జిత కల్యాణోత్సవం సేవను టీటీడీ రద్దు చేసింది. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు బాలాజి రంగాచార్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి: ఎంఈవో

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో తిరుమల్ రాజు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నాడు-నేడు ఫేస్-2 పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఎంఈవో తిరుమల రాజుకు పేర్కొన్నారు. సోమవారం విద్యాశాఖ కార్యాలయంలో నాడు-నేడు ఫేస్-2 ప్రధానోపాధ్యాయులకు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, సిఆర్ఎంటిలకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో తిరుమల రాజు, బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నాడు-నేడు పెండింగ్ వర్కులు గురించి చర్చించారు. పాఠశాలలు రివోపెనింగ్ నాటికి విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో మేజర్ అండ్ మైనర్ రిపేరు, ఎలక్ట్రిఫికేషన్, టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్, తాగునీరు వంటశాల, పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉండాలని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో వంట చేసే వర్కర్లకి 30వ (గురువారం) మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ఎగువ కనకం పాలెం నందు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమంకు ప్రతి పాఠశాల నుంచి ఒక్కోవంట మనిషి హాజరైయ్యేట్లు భాధ్యత వహించాలని తెలిపారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ ఎన్రోల్మెంట్ పెంచుకొనుటకు కృషి చేయాలని సూచించారు. విద్యా కానుక కిట్లు పాఠశాల పున:ప్రారంభం నాటికి విద్యార్థులకు అందరికీ అందే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బొప్పరాజుపల్లిలో పోలీసుల విస్తృత తనిఖీలు

- ఏడు ద్విచక్ర వాహనాలు సీజ్

ప్రజాశక్తి-రామచంద్రపురం: రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని అనుపల్లి పంచాయతీ బొప్పరాజు పల్లి గ్రామ పరిసర ప్రాంతాలలో సిఐ రామయ్య ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బందితో విస్తృత తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం 6గంటలకు బొప్పరాజు పల్లి గ్రామానికి చేరుకుని ప్రతి ఇంటిని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ రామయ్య మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు సందర్భంగా ఎలాంటి హింసాత్మక దాడులు, అవాంఛనీయ ఘటనలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా గ్రామాల్లో ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహించరాదని పేర్కొన్నారు. వాట్సప్ గ్రూపుల్లో ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, హింసాత్మక దాడులను ప్రేరేపించేలా సందేశాలు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేని 7ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. అనంతరం అనుపల్లి, నూతుగుంటపల్లి, నెమ్మల్లగుంటపల్లి, బీర మాకుల కండ్రిగ గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం, చంద్రగిరి ఎస్ఐలు చిరంజీవి, అనిత, సురేష్, ధనంజయులు, యోబు, శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ విజేతలుగా పుత్తూరు క్రీడాకారులు

- క్రీడాకారులను అభినందించిన ప్రెసిడెంట్ డి.జయప్రకాష్(చిట్టి)

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రేణిగుంటలో శని, ఆదివారాల్లో నిర్వహించిన పుట్బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్లో పుత్తూరు పుట్బాల్ డెవలప్మెంట్ క్లబ్ క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఈ టోర్నమెంట్‌లో పుత్తూరు, అరక్కోణం, అనంతపురం, శ్రీకాళహస్తి, కడప, తిరుపతి, రేణిగుంట, పలమనేరు, హిందూపురం, ప్రాంతాల నుంచి 18టీంలు పాల్గొన్నారు. పుట్బాల్ గేమ్‌లో నూతన ఒరవడిలో భాగంగా ఒక టీంలో ఏడు మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పుత్తూరు పుట్బాల్ డెవలప్మెంట్ క్లబ్ విన్నర్స్‌గా నిలిచి రూ.15వేల బహుమతిగా పొందారు. రేణిగుంట రన్నర్స్‌గా నిలిచి రూ.పదివేల బహుమతిగా పొందారు. తిరుపతి జిల్లా పుట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీ.జయ ప్రకాష్ గెలుపొందిన పుత్తూరు జట్టుకు, నవీన్ కుమార్‌ని, సభ్యులు కెప్టెన్ బాలాజీ, ఈ. దినేష్, సి. జగదీష్, ఏ. దిలీప్, కే. శ్రీనివాసులు, ఇసాక్, రావుఫ్, గణేష్, ఉదయ్, చరణ్ లను అభినందించారు. ఈ సంవత్సరం ఇప్పటికి మూడు టోర్నమెంట్లో గెలిచిన పుట్బాల్ డెవలప్మెంట్ క్లబ్ పుత్తూరు ఇకమీదట మరెన్ని టోర్నమెంట్లో విన్నర్స్ గా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్విమ్స్ ఫిజియోథెరపీ విభాగపు అధ్యాపకునికి డాక్టరేట్ డిగ్రీ ప్రధానం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీలోస్విమ్స్ సర్జికల్ ఆంకాలజి విభాగం నందు పరిశోధనలు నిర్వహించిన అధ్యాపకులు ఎస్. రాఘవ క్రిష్ణకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి) పట్టాను ప్రధానం చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలియజేశారు. సర్జికల్ ఆంకాలజీ విభాగపు అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్ర పర్యవేక్షణలో ప్రాస్పెక్టివ్ రండోమిజ్డ్ కంట్రోల్డ్ స్టడీ కంపేరింగ్ ది ఎఫికేసి ఆఫ్ మ్యాన్యువల్ లింపాటిక్ డ్రైనేజ్ అండ్ న్యూమాటిక్ కంప్రేషన్ థెరపి ఆన్ సెంకండరీ లోయర్ లింబ్ లింపడిమా ఇన్ పేషంట్స్ అండర్ గోయింగ్ సర్జరీ అండ్ /ఆర్ రేడియోథెరపి ఫర్ గైనకాలజికల్ మాలిగ్నలసిస్) అనే అంశంపై పరిశోధనను సమర్పించినందుకు ఆయనకి పీహెచ్డీ ప్రధానం చేశారు.

ఈ సందర్భంగా సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్, డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, ఆర్ఎంఒ డాక్టర్ కోటిరెడ్డి, వివిధ విభాగపు అధిపతులు విద్యార్థులు ఆయనని అభినందించారు.

కందుకూరికి ఘన నివాళి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఈ తరం కవిత వేదిక వ్యవస్థాపకులు వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవయుగ వైతాళికుడు, గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. బాల్యవివాహాలను నిర్మూలించి, వితంతు వివాహాలను జరిపించారన్నారు. వితంతువుల యోగక్షేమాల కోసం ప్రత్యేకంగా ఆశ్రమాన్ని నిర్వహించారని గుర్తు చేశారు. సుమారు 10.30 గంటకు పైగా రచనలు చేసిన సంఘసంస్కర్త కందుకూరి అని కొనియాడారు. వేమన విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు నడ్డా నారాయణ మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు కందుకూరి వీరేశలింగం తన చివరిశ్వాస వరకు పోరాడాడని తెలిపారు. నేటి యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, కార్యదర్శి మల్లారపు నాగర్జున, ముని లక్ష్మి, బాలాజీ, కుప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

'నేషనల్ చైల్డ్ మిస్సింగ్' పై అవగాహన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: పవర్ ఆఫ్ మిషన్ మైండెడ్ ఫౌండేషన్ తిరుపతి మండల లీగల్ సర్వీస్ అథారిటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ చైల్డ్ మిస్సింగ్ అండ్ అపహరణ నివారణ దినోత్సవం సందర్భంగా తిరుపతి కోరమేనుగుంట బొజ్జతారకం కాలనీలో కాలనీ బాలలు ప్రజలతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. తిరుపతి జిల్లా పి ఎమ్ ఎమ్ ఫౌండేషన్ ప్రోగ్రాం అవేర్నెస్ ఇంచార్జ్ శ్రీ రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పిఎంఎం ఫౌండేషన్ జిల్లా ఇన్చార్జి శ్రీమతి ప్రసన్న మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపల బాలలు ఎక్కువగా వివిధ రూపాలలో వివిధ ప్రాంతాలలో అపరిచిత వ్యక్తుల ద్వారా అపహరణకు గురై ఆ తర్వాత పూర్తిగా కనపడకుండా పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి కుటుంబాల లోని తల్లిదండ్రులు పిల్లల పట్ల నిరంతరం జాగ్రత్తగా వ్యవహరించాలి అని ఆమె సూచించారు.పి ఎం ఎం ఫౌండేషన్ కౌన్సిలర్ ఎన్ దొరస్వామి, ఈ ఫౌండేషన్ ద్వారా బాలలకు మరియు మహిళలకు ఉచిత న్యాయ సేవలు ప్యానల్ లీగల్ అడ్వకేట్ పవిత్ర అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు పి.అమర్నాథ్ మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు, పారలీగల్ వాలంటీర్, ప్యానల్ అడ్వకేట్ పవిత్ర, బొజ్జతారకం కాలనీ అభివద్ధి సంఘం సభ్యులు, మహిళలు, కాలనీ ప్రజలు బాలలు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత పుట్టినరోజు వేడుకలు

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పోతుగుంట విజయబాబు పుట్టినరోజు వేడుకలు సోమవారం పుత్తూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులతో పాటు విజయ్ బాబు అనుచరులు, అభిమానులు అంతా కలిసి ఎంబి రోడ్డులోని ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, నాయకులు రవి నాయుడు, ధనపాల్, చంద్ర యాదవ్, రమేష్, ప్రకాష్, బాబురాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో తాగునీటి కొరత

- అవస్థలు పడుతున్న రోగులు



ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ పెద్ద ఆసుపత్రిలో దాతలు అందించిన ఆర్వో ప్లాంట్ సామగ్రి పరికరాలు తుప్పు పట్టిన స్థితిలో మూలనపడ్డాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడం, వినియోగంపై నిర్లక్ష్యం, సిబ్బంది బాధ్యతారాహిత్యం వల్ల ఆసుపత్రిలో నీటిని శుద్ధి చేసే ఆర్ఓ ప్లాంట్ అలంకారప్రాయంగా మారింది. వీటి మరమ్మతుకు ఇప్పటికే కొంత నిధులు ఖర్చు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మంచినీటి కొరకు ఇక్కడికి వచ్చే రోగులు, స్థానికులు దప్పిక కేకలతో అవస్థ పడుతున్నట్లు ఆవేదన చెందారు. ఇకనైనా ఉన్నత అధికారులు దీనిపై ద్రుష్టి సాధించి మరమ్మతులు చేయించి రోగులకు తాగునీటి వసతి కల్పించవలసిందిగా స్థానికులు కోరారు.